# ఈ-బైక్ సెగ్మెంట్‌లోకి ఓలా

**రోడ్‌స్టర్ ఎక్స్ మోటర్‌సైకిల్ విడుదల..ప్రారంభ ధర రూ.74,999**

**సింగిల్ చార్జింగ్‌తో 501 కిలోమీటర్ల ప్రయాణం**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ సంస్థ ఓలా..తాజాగా ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్ సెగ్మెంట్‌లోకి అడుగుపెట్టింది. రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్‌లో భాగంగా ఒకేసారి నాలుగు మాడళ్లను పరిచయం చేసింది. వీటిలో రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్ బైకులు 2.5 కిలోవాట్లు, 3.5 కిలోవాట్లు, 4.5 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన బైకులు రూ.74,999, రూ.84,999, రూ.94,999 ధరతో లభించనున్నాయి. అలాగే రోడ్‌స్టర్ ఎక్స్+ మాడల్ 4.5 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ రూ.1,04,999, రోడ్‌స్టర్ ఎక్స్+ 9.1 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ రూ.1,54,999గా నిర్ణయించింది. ఈ సందర్భంగా కంపెనీ సీఎండీ భావిష్ అగర్వాల్ మాట్లాడుతూ..దేశీయ ఈవీ విభాగంలో చరిత్ర సృష్టించిన సంస్థ..ఈసారి బైకుల సెగ్మెంట్‌లోకి అడుగుపెట్టినట్లు చెప్పారు.

**రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్ బైకు ప్రత్యేకతలు..**

- వీటిలో రోడ్‌స్టర్ ఎక్స్+ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 501 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.
- కేవలం 2.7 సెకండ్లలో 40 కిమీ వేగాన్ని అందుకోనున్న ఈ బైకు గంటకు 125 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నది.
- ఈ బైకులపై మూడేండ్లు లేదా 50 వేల కి.మీ. వరకు వ్యారంటీ కల్పిస్తున్నది.
- ముందస్తుగా ఈ బైకులు బుకింగ్ చేసుకున్నవారికి వచ్చే నెల చివరి నుంచి డెలివరీ చేయబోతున్నది.
- 4.3 ఇంచుల ఎల్‌సీడీ స్క్రీన్, మూవ్ ఆపరేటింగ్ సిస్టమ్ 5తో తీర్చిదిద్దింది.

# సూచీల వరుస ర్యాలీకి బ్రేక్

## సెన్సెక్స్ 312, నిఫ్టీ 43 పాయింట్ల నష్టం

ముంబై, ఫిబ్రవరి 5: స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. వాణిజ్య యుద్ధానికి తోడు ఈవారం చివర్లో రిజర్వుబ్యాంక్ తన తదుపరి సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం మదుపరులను అమ్మకాలవైపు నడిపించింది. ఇంట్రాడేలో 400 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 312.53 పాయింట్లు కోల్పోయి 78,271.28 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 42.95 పాయింట్లు కోల్పోయి 23,696.30 వద్ద నిలిచింది. 23,807 నుంచి 23,680 పాయింట్ల శ్రేణిలో కదలాడిన నిఫ్టీ చివరకు నష్టపోయింది. దేశీయ కరెన్సీ విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకోవడం మార్కెట్లో సెంటిమెంట్‌ను నిరాశపరిచింది. 30 షేర్ల ఇండెక్స్‌లో ఏషియన్ పెయింట్స్ అత్యధికంగా 3 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతో పాటు టైటాన్, నెస్లె, హెచ్‌యూఎల్, ఎస్బీఐ, లార్సెన్ అండ్ టుబ్రో, ఐటీసీ, జొమాటో,హెచ్‌సీఎల్ టెక్, కొటక్ బ్యాంక్, రిలయన్స్, టీసీఎస్, మహీంద్రా, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, మారుతి, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. కానీ, అదానీ పోర్ట్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా మోటర్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా స్టీల్, ఎన్టీపీసీ, టెక్ మహీంద్రా షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది. రంగాలవారీగా చూస్తే వడ్డీరేట్లకు సంబంధం ఉన్న రంగాల్లో షేర్లు కుదేలయ్యాయి. ముఖ్యంగా రియల్టీ రంగ సూచీ అత్యధికంగా 1.66 శాతం కోల్పోగా, ఎఫ్‌ఎంసీజీ 1.42 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.21 శాతం, వాహన రంగ షేర్లు కూడా నష్టపోయాయి. అలాగే ఆయిల్ అండ్ గ్యాస్ 1.89 శాతం, సేవలు 1.59 శాతం, మెటల్ 1.55 శాతం, ఎనర్జీ 1.30 శాతం, హెల్త్‌కేర్ రంగ సూచీ 1.21 శాతం చొప్పున పెరిగాయి. ఈ నెల 7న ఆర్బీఐ తన తదుపరి పరపతి సమీక్షను ప్రకటించబోతున్నది.



# బంగారం దారెటు?

**ధరలు పెరుగుతాయా.. తగ్గుతాయా! • డైలమాలో కొనుగోలుదారులు**

**ఇప్పటికే ఆల్‌టైమ్ హైలో రేట్లు • పెట్టుబడులపై నిపుణుల మాటేంటి..**



*సుబ్రహ్మణ్యం కూతురు పెండ్లి ఖాయమైంది. అమ్మాయికి నగానట్రా కొనాలనుకున్నారు. కానీ పెరుగుతున్న ధరల్ని చూసి బెంబేలెత్తిపోతున్నారు.*

*ధనుష్ తన పిల్లల కోసం ఎంతో కొంత బంగారాన్ని కూడబెట్టాలనుకుంటున్నాడు. అయితే పరుగులు పెడుతున్న రేట్లతో సందిగ్ధంలో పడిపోయాడు.*

*స్వాతి తన సంపాదనతో ఓ నెక్లెస్ కొనాలనుకున్నది. మార్కెట్ పోకడను చూసి వెనక్కి తగ్గాల్సి వచ్చింది. నిజానికి మనలో చాలామందిది ఇప్పుడిదే పరిస్థితి. అసలు బంగారం దారెటు? ధరలు పైకా, కిందికా? పెట్టుబడులు పెడితే కరెక్షన్ వస్తుందేమో? అన్న సందేహాలు మదిని తొలిచేస్తున్నాయి మరి.*

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: బంగారం ధరలు మళ్లీ పరుగులు పెడుతున్నాయి. రోజుకో రికార్డు స్థాయికి చేరుతూ ఆల్‌టైమ్ హైల్లోనే కదలాడుతున్నాయి. ఈ క్రమంలోనే బుధవారం ఒక్కరోజే దేశంలోని ప్రధాన నగరాల్లో తులం వెయ్యి రూపాయలకుపైగా ఎగబాకింది. అయితే అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఢిల్లీ మార్కెట్ మూతబడగా.. హైదరాబాద్ మార్కెట్‌లో మాత్రం 10 గ్రాముల మేలిమి బంగారం విలువ ఎప్పుడూ లేనివిధంగా తొలిసారి రూ.87,000లను తాకడం గమనార్హం. పెండ్లిళ్ల సీజన్ కావడంతో రాబోయే రోజుల్లో ఇంకా పెరగవచ్చన్న సంకేతాలున్నాయి.

**ఏడాది ఆఖర్లో లక్షకు?**

రాబోయే రోజుల్లో బంగారం ధరలు మరింత పెరుగుతాయంటున్న మార్కెట్ నిపుణులు.. ఈ ఏడాది చివర్లో దేశీయంగా తులం లక్ష రూపాయలను తాకినా ఆశ్చర్యపోనవసరం లేదని చెప్తుండటం గమనార్హం. ఇక త్వరలో విడుదలయ్యే అమెరికా ఆర్థిక గణాంకాలతో ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతాయని పేర్కొంటున్నారు. ఇందులోభాగంగానే ఔన్స్ 3,000లకు వెళ్లే వీలుందంటున్నారు. ఇప్పటికే తొలిసారి 2,830 డాలర్లను అధిగమించింది. అయితే 2-3 నెలల్లో ధరలు తగ్గుముఖం పట్టవచ్చనీ చెప్తున్నారు. కానీ ఆ తర్వాత మాత్రం పెరుగుతూపోతాయని, ఈ క్రమంలోనే అక్టోబర్-డిసెంబర్‌లో భారతీయ విపణిలో రూ.95,000-1,00,000 మార్కును చేరడం ఖాయమనే అభిప్రాయాలనే వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి ఈ ఏడాది ధరల స్థిరీకరణకు అవకాశాలు తక్కువేనన్న మాట మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ నుంచి వినిపిస్తున్నది.

**పెట్టుబడులు పెడుతారా?**

దేశ, విదేశీ మార్కెట్లలో బంగారం ధరలు భారీగా పెరుగుతూపోతున్న నేపథ్యంలో పెట్టుబడులపై కూడా సగటు మదుపరి ఏ నిర్ణయం తీసుకోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆభరణాల రూపంలో పుత్తడి కొంటే తరుగు, తయారీ చార్జీలతోపాటు నిల్వ చేసుకోవడం కూడా సమస్యగా మారుతున్నదని చెప్పక తప్పదు. దీంతో గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ ఫండ్లు ఉత్తమమని ఇన్వెస్టర్లకు మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. అయితే ప్రస్తుత ట్రెండ్ దృష్ట్యా పెద్ద మొత్తంలో ఈ పెట్టుబడులు ఉండకుండా జాగ్రత్త తీసుకోవడం కూడా ముఖ్యమేనని హితవు పలుకుతున్నారు. కానీ నిర్ణయం తీసుకునే ముందు అంతర్జాతీయ పరిణామాలను గమనించడం లాభదాయకమని సలహా ఇస్తున్నారు.



## హైదరాబాద్‌లో తులం 87,000

హైదరాబాద్ రిటైల్ మార్కెట్‌లో పసిడి ధరలు మునుపెన్నడూ లేనివిధంగా నమోదయ్యాయి. బుధవారం 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల ధర ఆల్‌టైమ్ హైని తాకుతూ ఏకంగా రూ.87,000 పలికింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం రేటు సైతం రూ.78,900గా ఉన్నది. ఈ ఒక్కరోజే రూ.1,000 పుంజుకోవడం గమనార్హం. మంగళవారం కూడా పుత్తడి ధరల్లో భారీ పెరుగుదలే కనిపించింది. దీంతో రెండు రోజుల్లోనే రూ.2వేలకుపైగా బంగారం రేటు ఎగిసినట్టైంది. మరోవైపు కిలో వెండి విలువ రూ.98,000గా ఉన్నట్టు వ్యాపార వర్గాలు తెలిపాయి. ఒక్కరోజే రూ.1,000 పుంజుకున్నది.

### ధరల పెరుగుదలకు కారణాలివే..

**• ద్రవ్యోల్బణం**

అమెరికాలోని ట్రంప్ సర్కారు చైనాపై 10 శాతం సుంకాలను విధించడం, కెనడా-మెక్సికోలపై 25 శాతం చొప్పున ప్రతిపాదించడం.. గ్లోబల్ మార్కెట్‌లో ద్రవ్యోల్బణానికి దారితీస్తున్నది. దీంతో మదుపరులు ఆ ప్రభావాన్ని తట్టుకొనేందుకు బంగారాన్ని రక్షణగా ఎంచుకుంటున్నారు. ఇక పెరుగుతున్న ధరలను కట్టడి చేసేందుకు ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను పెంచే అవకాశాలూ కనిపిస్తున్నాయి. ఈ అంచనా కూడా గోల్డ్ మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నది.

**• సురక్షిత పెట్టుబడి సాధనం**

స్టాక్ మార్కెట్లలో నెలకొన్న ఒడిదొడుకుల నడుమ ఇన్వెస్టర్లు.. బంగారంపై మరింత ఎక్కువగా పెట్టుబడులు పెడుతున్నారు. రాజకీయ, భౌగోళిక అనిశ్చిత పరిస్థితులు సైతం గోల్డ్‌ను సురక్షిత పెట్టుబడి సాధనంగా మార్చేస్తున్నాయి. ఫలితంగా సహజంగానే డిమాండ్ పెరిగి రేట్లు పైపైకి వెళ్తున్నాయి.

**• సెంట్రల్ బ్యాంక్‌ల పసిడి కొనుగోళ్లు**

బంగారాన్ని ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు కూడా పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నాయి. అమెరికాతో వాణిజ్య యుద్ధం సంకేతాల మధ్య చైనా తమ పసిడి నిల్వలను ఇంకా పెంచుకుంటూపోతున్నది. ఇది కూడా ధరల పెరుగుదలకు దారితీస్తున్నది.

**• డాలర్ ఇండెక్స్ కదలికలు**

అమెరికా డాలర్ ఇండెక్స్ ఇటీవలే 109 మార్కును దాటేసింది. దీని ప్రభావం బంగారంసహా అన్ని కమోడిటీ మార్కెట్లపై పడుతున్నది. మరోవైపు అంతర్జాతీయ మదుపరులు కూడా ఈక్విటీ, బాండ్ మార్కెట్లు క్రాష్ అవుతాయన్న భయాలతో గోల్డ్ వైపే చూస్తున్నారు.

**• వాణిజ్య యుద్ధం భయాలు**

అమెరికా తమపై విధించిన సుంకాలకు బదులుగా చైనా కూడా అగ్రరాజ్యం నుంచి వచ్చే దిగుమతులపై సుంకాలు వేసింది. ఈ ప్రతీకార సుంకాలు.. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య యుద్ధానికి దారితీయవచ్చన్న ఆందోళనల్ని కలిగిస్తున్నది. ఫలితంగా పెట్టుబడులన్నా బంగారం వైపు క్యూ కడుతున్నాయి.

### భారతీయ గోల్డ్ డిమాండ్ 803 టన్నులు

*గత ఏడాది దేశంలో గోల్డ్ డిమాండ్ 802.8 టన్నులుగా ఉన్నట్టు ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) బుధవారం తెలియజేసింది. 2023తో పోల్చితే ఇది 5 శాతం పెరిగినట్టు పేర్కొన్నది. నాడు 761 టన్నులుగా నమోదైంది. కాగా, విలువపరంగా చూసినట్టైతే ఈ డిమాండ్ 2023లో రూ.3,92,000 కోట్లుగా ఉంటే.. 2024లో రూ.5,15,390 కోట్లకు పెరిగింది. ఇక ఈ ఏడాది డిమాండ్ 700-800 టన్నుల మేర ఉండొచ్చని కూడా తాజా రిపోర్టులో డబ్ల్యూజీసీ ఇండియా విభాగం ప్రాంతీయ సీఈవో సచిన్ జైన్ తెలిపారు. ప్రపంచ డిమాండ్ 4,974 టన్నులుగా ఉన్నది. సెంట్రల్ బ్యాంకులు 1044.6 టన్నుల బంగారం కొన్నాయి.*

# రూపాయికి తప్పని తిప్పలు

**{ 39 పైసలు పడిపోయిన మారకం విలువ }**

ముంబై, ఫిబ్రవరి 5: దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులుపడ్డాయి. అంతర్జాతీయ వాణిజ్యయుద్ధానికి అమెరికా కాలు దువ్వుతుండటంతో డాలర్ కరెన్సీ అనూహ్యంగా బలపడుతున్నది. దీంతో ఇతర కరెన్సీలు డీలా పడుతున్నాయి. దీంట్లోభాగంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ బుధవారం ఒకేరోజు 36 పైసలు కోల్పోయి చారిత్రక కనిష్ఠ స్థాయి 87.43 వద్దకు జారుకున్నది. అమెరికా-చైనా దేశాల మధ్య టారిఫ్‌ల యుద్ధం మరింత ముదురుతుండటంతో రూపాయిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. దీంతోపాటు రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా కరెన్సీ పతనానికి ప్రధాన కారణమన్నారు. 87.13 వద్ద ప్రారంభమైన డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు ఇంట్రాడేలో 87.49 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివరికి 36 పైసల నష్టపోయి 87.43 వద్ద నిలిచింది. మంగళవారం నాలుగు పైసలు కోలుకొని 87.07 వద్ద స్థిరపడింది. రూపాయి పతనంతో దేశీయ దిగుమతులకోసం అదనంగా నిధులు వెచ్చించాల్సి వస్తున్నది. దేశీయ వినిమయంలో 80 శాతం చమురు దిగుమతులపై ఆధారపడుతున్న భారత్‌కు రూపాయి పతనం అధికంగా చెల్లించాల్సి ఉంటుందని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు.

# ఎల్‌ఐసీకి మరో జీఎస్టీ నోటీస్

- **రూ.105 కోట్ల డిమాండ్‌తో జారీ**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) సంస్థకు ఏడేండ్లకుగాను 105.42 కోట్ల వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) డిమాండ్ నోటీస్ జారీ అయ్యింది. ఆయా రాష్ర్టాల్లోని కార్యకలాపాలకు సంబంధించి పన్ను, దానిపై వడ్డీ, జరిమానాలతో కూడిన జీఎస్టీ నోటీస్ బుధవారం వచ్చినట్టు కంపెనీ పేర్కొన్నది. 2017-18 నుంచి 2023-24కు మధ్య కాలానికిగాను తాఖీదులందాయని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఎల్‌ఐసీ తెలియజేసింది. అయితే ఈ నోటీస్‌పై లక్నో అప్పీల్స్ కమిషనర్ ఎదుట అప్పీల్ చేసుకునే వెసులుబాటు ఉన్నట్టు సంస్థ వెల్లడించింది. ఇదిలావుంటే 2017-18 నుంచి 2021-22కు మధ్య రూ.101.95 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీస్ మంగళవారం కూడా ఒకటి అందింది.




మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన పీఆర్సీటీం

## వైద్యశాలల్లో పీఆర్సీ టీం

విద్యానగర్, ఫిబ్రవరి 5: భారత ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పాపులేషన్ రీసర్చ్ సెంటర్ (పీఆర్సీ) టీం బుధవారం జిల్లాలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్, బస్తీ దవాఖానలు, మాతా శిశు ఆరోగ్య కేంద్రం, కరీంనగర్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌ను సందర్శించింది. టీం సభ్యులు తమిళనాడుకు చెందిన డాక్టర్ వీ సరవన కుమార్, డాక్టర్ రాజ్‌కుమార్ ఆయా వైద్యశాలల్లో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం పోర్టల్‌లో సమర్పించిన వివరాలను పర్యవేక్షించారు. మెరుగైన వైద్య సేవలు అందడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ గుండా వీరారెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ నవీన, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## మూడోరోజు ఒక నామినేషన్

కలెక్టరేట్, ఫిబ్రవరి 5: కరీంనగర్-ఆదిలాబాద్-మెదక్-నిజామాబాద్ పట్టభద్రుల శాసనమండలి స్థానానికి మూడోరోజు ఒక నామినేషన్ దాఖలైంది. ఆదిలాబాద్ జిల్లా జన్నారం మండలం దేవునిగూడ గ్రామానికి చెందిన గవ్వల శ్రీకాంత్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. అలాగే, ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేసిన సిలివేరి శ్రీకాంత్ పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానానికి, పిడిశెట్టి రాజు పట్టభద్రుల స్థానానికి మరోసారి వేశారు. బుధవారం వరకు పట్టభద్రుల స్థానానికి మొత్తం తొమ్మిది మంది, ఉపాధ్యాయ స్థానానికి నలుగురు అభ్యర్థులు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి తెలిపారు.



ఒడిశా రాష్ట్ర బృందంతో సింగిల్‌విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి

## చొప్పదండి సింగిల్‌విండోను సందర్శించిన ఒడిశా బృందం

చొప్పదండి, ఫిబ్రవరి 5: చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని బుధవారం ఒడిశా రాష్ట్ర కో ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ ఆర్సీఎస్ సంతోష్ సాహు, మరో 20 మంది సభ్యుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వారికి సంఘం అధ్యక్షుడు వెల్మ మల్లారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం స్థానిక సంఘం పనితీరుతో పాటు రైతాంగానికి అందుతున్న సేవల గురించి వివరించారు. దేశంలోనే అత్యున్నత సంఘంగా పేరు తెచ్చుకున్న విషయాలను ఒడిస్సా బృందానికి తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘాన్ని ఒడిస్సా బృందం సభ్యులు అభినందించారు. ఇక్కడ పీడీసీ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ, పీడీసీ ఇంచార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, కో ఆప్ ఇంటర్న్ అభినవ్, డైరెక్టర్లు గుర్రం ఆనందరెడ్డి, కల్లెం లక్ష్మారెడ్డి, సీఈవో కల్లెం తిరుపతిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

# మంచినీళ్లో మహాప్రభో..

- మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం
- పోతిరెడ్డిపల్లి గొల్లపల్లికి నిలిచిన సరఫరా
- వెంటనే చర్యలు తీసుకోవాలని మహిళల వేడుకోలు



గొల్లపల్లిలో మంచినీటి కోసం బిందెలతో మహిళలు

**తాగునీటి కటకట మొదలైంది. మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపంగా మారింది. వేసవికాలం రాకముందే అటు తాగడానికి, ఇటు ఇంటి అవసరాలకు నీళ్ల లేక ఇబ్బందులు పడాల్సిన దుస్థితి దాపురించింది. పబ్లిక్ ట్యాబ్‌లు, బోరింగుల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి రాగా, పట్టని యంత్రాంగం తీరు విమర్శలకు తావిచ్చింది.**

**- వీణవంక, ఫిబ్రవరి 5**

**గొల్లపల్లికి 20 రోజులుగా నీళ్లు బంద్**

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి పరిధిలో గొల్లపల్లిలో సుమారు 200 జనాభా ఉంటుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు గ్రామాన్ని ఆనుకొని ఉన్న మానేరువాగు నుంచి మంచి నీళ్లు వచ్చేవి. బీఆర్ఎస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ నీటిని ఇంటింటికీ అందజేశారు. అయితే రెండు నెలలుగా అంతంత మాత్రంగా వచ్చిన భగీరథ నీరు, 20 రోజులుగా సరఫరా నిలిచిపోయింది. గ్రామంలో ఉన్న ఒక్క బోరింగ్ వద్దకు వెళ్లి మహిళలు బిందెలతో క్యూ కడుతున్నారు. వృద్ధులు బోరింగ్ కొట్టేందుకు అవస్థలు పడుతున్నారు. మంచినీటికి, ఇంటి అవసరాలకు నీళ్లు రాక నానాకష్టాలు పడుతున్నామని, స్థానిక అధికారులు, నాయకులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే వేసవికాలం దృష్ట్యా మంచినీటి కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మహిళలు వేడుకుంటున్నారు. కాగా, ఈ విషయమై ఆర్‌డబ్ల్యుఎస్ ఇంట్రా ఏఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా, ప్రతి రోజు మిషన్ భగీరథ నీళ్ల ట్యాంక్‌ను నింపి, ప్రజలకు విడుదల చేస్తామని, గొల్లపల్లి గ్రామంలో ఎందుకు నీరు రావట్లేదో క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తామని చెప్పారు.

**నీళ్లు రాక అరిగోసవడుతన్నం..**



20 రోజుల సంది మంచినీళ్లు రాక అరిగోసవడుతన్నం. ఎవ్వలకు జెప్పినా పట్టించుకుంటలేరు. ఇంతకు ముందు మానేరు నుంచి నీళ్లు అచ్చినప్పుడు మంచిగుండేది. మిషన్ భగీరథ నీళ్లు గూడ మంచిగ అచ్చేది. మూడు నెలల సంది సక్కగ అత్తలేవు.20 రోజుల నుంచయితే మొత్తానికే అత్తలేవు. ఇంట్లో పనులకు, తాగడానికి బోరింగే దిక్కయింది. గింతమందికి ఒక్కటే బోరింగ్ గావడంతో అది కూడా తడారిపోతంది. ఎవ్వలకు జెప్పినా పట్టించుకుంటలేరు. అచ్చేది ఎండాకాలం మా గోస దేవునికి ముడుతదిగావచ్చు. పెద్దసార్లు మా కష్టాలు జూసి ఎంటనే నీళ్లు అచ్చేటట్లు జేయాలె.

**- వజ్రమ్మ, గొల్లపల్లి(వీణవంక)**

# వికసిత్ భారత్‌పై ముగిసిన సదస్సు



మాట్లాడుతున్న మాజీ వీసీ చిరంజీవులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 5: శాతవాహన విశ్వవిద్యాలయం, అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్@2047 ఇండియా విజన్ ఫర్ డెవలప్మెంట్' అనే అంశంపై రెండ్రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు ముగిసింది. బుధవారం యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత ఐఏఎస్, శాతవాహన విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి టీ చిరంజీవులు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ అండ్ రీసెర్చ్ సదరన్ రీజియన్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ టీ చిరంజీవులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి భారతదేశం సాధించిన విజయాలను గుర్తించాలన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ ఎన్నో సమస్యలకు పరిష్కారాలను సూచించిందని చెప్పారు. వికసిత్ భారత్ యొక్క లక్ష్యాలను సమర్థవంతంగా అమలుచేస్తే భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ మాట్లాడుతూ, తాను పదవి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విశ్వవిద్యాలయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. విశ్వవిద్యాలయానికి ఇంజినీరింగ్, న్యాయ, ఎం ఫార్మసీ కోర్సులకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకువచ్చానని, ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. విశ్వ విద్యాలయాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచుతానని, వికసిత్ శాతవాహనగా అభివృద్ధి చేస్తానని ఉద్ఘాటించారు. సెమినార్ డైరెక్టర్, అర్థశాస్త్ర విభాగపు హెచ్ఓడీ డాక్టర్ కోడూరి శ్రీవాణి, రెండ్రోజుల జాతీయ సదస్సులో నాలుగు టెక్నికల్ సెషన్స్ ద్వారా 50 మంది ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించి చర్చల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ రిజిస్ట్రార్ రవికుమార్ జాస్తి, విశిష్ట అతిథి ప్రొఫెసర్ బీ సుధాకర్ రెడ్డి, వీసీ ఓఎస్‌డీ డాక్టర్ డీ హరికాంత్, ప్రొఫెసర్ సురేపల్లి సుజాత, ప్రొఫెసర్ వరప్రసాద్, డాక్టర్ కే పద్మావతి, డాక్టర్ మహ్మద్ జాఫర్ జర్రి, డాక్టర్ అబ్రహం బాకి, డాక్టర్ బేగం, డాక్టర్ మునావర్, విద్యాసాగర్, కనకయ్య, డాక్టర్ తిరుపతి, డాక్టర్ ఫాతిమా సుల్తానా బేగం, డాక్టర్ జమున, వెంకటేష్, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కోర్కల్ గ్రామశాఖ కమిటీ ఎన్నికలో కాంగ్రెస్ నాయకులతో వాగ్వాదం చేస్తున్న కార్యకర్త

## కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక వివాదం

వీణవంక, ఫిబ్రవరి 5: కోర్కల్ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక రసాభాసగా మారింది. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆదేశాల మేరకు మండలాధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంకాగానే, ఆసక్తి గల వారు అధ్యక్ష పదవి కోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించగా, 12 మంది పేర్లు ఇచ్చారు. అయితే మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడిన వారికి, ఎన్నికల్లో జెండా మోసిన వారికే అధ్యక్ష పదవి ఇవ్వాలని, పార్టీ మారిన వారికి ఇచ్చేది లేదని అక్కడికి వచ్చిన నాయకులతో గ్రామంలో రెండు వర్గాలుగా ఉన్న కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. తమ వర్గానికే పదవి ఇవ్వాలని ఎవరికి వారే డిమాండ్ చేశారు. సుమారు గంటన్నర గొడవ జరుగగా, అధ్యక్ష పదవికి ఇరువర్గాల నుంచి పోటీ తీవ్రంగా ఉందని, విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్తామని సీనియర్ నాయకుడు గంగాడి తిరుపతిరెడ్డి పేర్కొనడంతో కార్యకర్తలు నిరాశతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## ఎల్ -21 మైనర్ కెనాల్ వద్దే వద్దు


- సుందరగిరిలో భూ బాధితుల నిరాహార దీక్ష

చిగురుమామిడి, ఫిబ్రవరి 5: గౌరవెల్లి ప్రాజెక్టు లింక్ కెనాల్‌కు అనుసంధానంగా నిర్ణయించిన ఎల్- 21 మైనర్ కాలువ వద్దే వద్దు అంటూ సుందరగిరికి చెందిన భూ బాధితులు బుధవారం గ్రామంలో నిరాహార దీక్షకు దిగారు. ఆ కాలువతో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని, దానిని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల భూ సేకరణ కోసం జరిగిన గ్రామ సభలోనూ కెనాల్ వద్దంటూ అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోలేదన్నారు. కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం కూడా అందజేసినట్లు చెప్పారు. అనంతరం 32 మంది రైతుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కార్యాలయంలో అందజేశారు. నిరాహార దీక్షలో రైతులు జీల సంపత్, మంతెన మహేందర్, జైరిపోతుల సిద్ధార్థ, వంతడుపుల తిరుపతి, రవీందర్, బాబు, భాగ్యలక్ష్మి, రాజవ్వ ఉన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఫిబ్రవరి 5: నగరంలో 11కేవీ మెయింటనెన్స్ పనులు, బొమ్మకల్ పరిధిలోని కొత్త డీటీఆర్ పనులు చేపడుతున్నందున ఆయా ఫీడర్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-1, కరీంనగర్ రూరల్ ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, రఘు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు కెమిస్ట్ భవన్, శివ థియేటర్ ఏరియా, వెంకటేశ్వర టెంపుల్, మాజీ ఎమ్మెల్యే సుద్దాల దేవయ్య ఇంటి ప్రాంతానికి 11కేవీ నేచర్ క్యూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సిటిజన్ కాలనీ, రజ్వీ చమాన్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## మాజీ సర్పంచులపై మళ్లీ నిర్బంధం




ముందస్తుగా అరెస్టు అయిన మాజీ సర్పంచ్‌లు

గన్నేరువరం/ జమ్మికుంట, ఫిబ్రవరి 5: తమ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ఇప్పించాలని డిమాండ్ చేస్తూ 'చలో సెక్రటేరియట్' తలపెట్టిన మాజీ సర్పంచులను సర్కారు నిర్బంధించింది. బుధవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జమ్మికుంటలో మండలం అంకుశాపూర్, మడిపల్లి, సైదాబాద్ గ్రామాలకు చెందిన తాజా మాజీ సర్పంచ్‌లైన కడిపికొండ రాజిరెడ్డి, మూగల పర్శరాములు, పుప్పాల రాజారాం, బీఆర్ఎస్ కార్యకర్త ఎల్లనందుల రామరాజును, గన్నేరువరం మండలంలో మాజీ సర్పంచులు గంప మల్లీశ్వరి వెంకన్న, శారద శ్రీనివాస్, పుల్లెల లక్ష్మి లక్ష్మణ్‌ను అరెస్ట్ చేశారు. కాగా, గన్నేరువరంలో మాజీ సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు తీగల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.